జ్ఞాన కేంద్రంగా వైవీయూ గ్రంథాలయం

– ఆధునీకరించిన వెబ్‌సైట్ ప్రారంభించిన వీసీ

వైవీయూ : విద్యార్థులు, పరిశోధకులు విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయాన్ని వినియోగించుకుని ప్రతిభామూర్తులుగా తయారుకావాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆకాంక్షించారు. శుక్రవారం వైవీయూలో డా. ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రగ్రంథాలయంలో లభించే పుస్తక సంపద, డిజిటల్ సౌకర్యాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేస్తూ ఆధునీకరించిన వెబ్‌సైట్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, గ్రంథాలయ బాధ్యులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు తరగతులు మినహా మిగులు సమయాల్లో గ్రంథాలయంలో పుస్తకాలతో స్నేహం చేయాలన్నారు. పుస్తకాలు, జర్నల్స్, థీసిస్, సాఫ్ట్‌వేర్స్ ఈ-జర్నల్స్, ఈ-డేటాబేస్, ఈ-బుక్స్ సిద్ధంగా ఉన్నాయన్నారు. స్కాలర్స్‌కు ప్రత్యేకంగా డిజిటల్ లైబ్రరీలో గ్రామర్లీ, జింజర్, ఎస్పీఎస్ఎస్, క్విల్‌బోట్, ఎండ్‌నోట్, కెమిడ్రా వంటి సాఫ్ట్‌వేర్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు. వెబ్‌సైట్‌లో ఈ కేటలాగ్‌ను సందర్శించి అవసరమైన పుస్తకాన్ని గుర్తించి గ్రంథాలయంలో ఆన్‌లైన్‌లోను, ఆఫ్‌లైన్‌లోను విద్యార్థులు చదువుకునే అద్భుత అవకాశం కల్పించామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రీసెర్చ్ స్కాలర్లు పరిశోధన గ్రంథం తయారుచేసుకునేందుకు డిజిటల్ గ్రంథాలయం చక్కగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఐటీ నెట్‌వర్కింగ్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి. శంకర్, లైబ్రరీ అసిస్టెంట్లు బి. ప్రసాద్‌రావు, ఆర్. విజయకుమార్, నాగరాజు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.


వైవీయూలో ఆధునీకరించిన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకం


మాట్లాడుతున్న తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: పుట్టగొడుగుల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టగొడుగులు మంచి ఆహారమని, వాటిలో పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం ఒక కుటీర పరిశ్రమగా పెట్టి కొంతమంది మంచి లాభాలను గడిస్తున్నారన్నారు. ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ మురళీకృష్ణ పుట్టగొడుగుల పెంపకంలో యువత ముందుకు కావాలన్నారు. అనంతరం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక పథకం కింద 20 మంది రైతులకు బాటరీ స్ప్రేయర్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ మంజుల, సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పలతతోపాటు పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

మిగిలిన కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలి


డిప్యూటీ సీఎంకు సమస్యను వివరిస్తున్న గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ నేతలు

కడప ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీస్ క్రమబద్ధీకరణ చేయగా మిగిలిపోయిన కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీస్‌ను కూడా క్రమబద్ధీకరించాలని గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై శుక్రవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో 3594 మంది జూనియర్ అధ్యాపకులకు గాను 1500 మందికి మేలు జరుగుతుందన్నారు. మిగిలిన వారికి రెండవ విడతలో క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మిగిలిన వారికి న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు గవర్నమెంట్ కాంట్రాక్ట లెక్చరర్ల ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


ఓబులాపురంలో బండలాగుతున్న వృషభాలు

కాశినాయన : మండలంలోని ఓబులాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దస్తగిరిస్వామి దర్గాలో శుక్రవారం గ్రామస్తులు గంధం, జెండా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సాహంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు.

ఈ పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన శివకృష్ణచౌదరికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.1,00,116లు, కాశినాయన మండలం ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి వృషభాలు రెండవ బహుమతి రూ.70,116లు, ప్రకాశం జిల్లా జె.సి.అగ్రహారం గ్రామానికి చెందిన లక్క నాగ శివశంకర్ వృషభాలు మూడవ బహుమతి రూ.60,116లు, వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె గ్రామానికి చెందిన చిట్టిబోయిన భరత్‌కుమార్ వృషభాలు నాల్గవ బహుమతి రూ.30,116లను గెలుచుకున్నాయి. మిగిలిన మూడు జతల వృషభాలకు రూ.15,116, 10,116, రూ.10,116లు అందజేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పోటీలను తిలకించడానికి జనం భారీగా తరలివచ్చారు.

ఉపాధ్యాయ సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయం

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే ఎస్టీయూ లక్ష్యమని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీణా విజయరామరాజు కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించి సంఘం శ్రేయస్సుకు కృషి చేసిన త్యాగధనుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన సంఘం ఎస్టీయూ అన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంస్కరణలపై తగు సూచనలు ఇస్తూ విద్యారంగ అభివృద్ధిలో ఎస్టీయూ క్రియాశీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, రాష్ట్ర నాయకులు సురేష్‌బాబు, రెడ్డెన్న, రాష్ట్ర కోకన్వీనర్ రవిశంకర్ రెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి, నాయకులు మహబూబ్‌బాష, సుబ్బరాయుడు, రామోహన్, సాదిక్‌అలీ తదితరులు పాల్గొన్నారు.


వీణా విజయరామరాజు కాంస్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

సాగు ఖర్చుకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలి

కడప అగ్రికల్చర్: పసుపు రైతులకు సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలని, కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటి తుడుపుచర్యేనని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, అన్నారు. శుక్రవారం ఏపీ రైతు సంఘ నాయకులు కడప మార్కెట్‌యార్డును సందర్శించి పసుపుతోపాటు వేరుశనగ ధాన్యాలను పరిశీలించి అక్కడ రైతులతో మాట్లాడారు. దేశంలో గోధుమ తరువాత అత్యధికంగా పండించే, వినియోగించే పంట వరి అన్నారు. అలాంటి వరికి కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ. 2060 నుంచి 2203 పెంచిందన్నారు. కరువు పీడిత రాయలసీమలో పండించే జొన్నకు రూ. 210 , సజ్జకు రూ. 150, రాగికి రూ. 268, పొద్దుతిరుగుడికి రూ. 360, పత్తికి రూ. 640 పెంచామని గొప్పలు చెప్పడం దారుణమన్నారు. లక్షకు పైగా పెట్టబడి పెట్టి ఏడాదికాల పరిమితిలో పండించే పసుపు పంటకు కేవలం 400 రూపాయలు పెంచడం సరికాదన్నారు. ఒక్క పెసర పంటకు మాత్రం రూ. 803 పెంచడం తప్ప మిగిలిన ఏ ఒక్క పంటకు పెంచకపోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రామచంద్రారెడ్డిపాటు రైతులు పాల్గొన్నారు.


కడప పసుపు యార్డులో రైతులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ నాయకులు

ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తంగెడుపల్లెలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ పాలనకు, ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలని ప్రజలను కోరారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టలేని విధంగా విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరశేఖర్, మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, సర్పంచు సుబ్బరాయుడు, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, యోగాంజనేయులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జడ్జి ప్రదీప్‌కుమార్ కడప నగరంలోని వాణిజ్య ప్రాంతాలైన బీకేఎం, ఆర్‌కేఎం, వైవీ స్ట్రీట్, మూర్తి స్టూడియో సర్కిల్, బాదర్‌ఖాన్ మసీదు ప్రాంతం, చెన్నూరు బస్టాండు తదితర ప్రాంతాల్లోని షాపులలో తనిఖీలను చేసి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

బడిఈడు పిల్లలను బడికి పంపాలని, పనులకు పంపరాదన్నారు. చిన్నారులతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమవుతుందన్నారు. అనంతరం పలు చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు మునుస్వామి, జాన్సన్, శ్రీనివాసులు రెడ్డి, డిస్ట్రిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ చెన్నారెడ్డి, పారా లీగల్ వాలంటరీలు సురేష్ సహాయం, కుమారి, వర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణదారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ప్రదీప్‌కుమార్, కార్మికశాఖ అధికారులు

రైతుల సంక్షేమమే జగనన్న లక్ష్యం

రాజంపేట రూరల్ : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని కె.బోయినపల్లిలోని మార్కెట్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆకేపాటి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించి జననేత అండగా నిలిచారన్నారు. అదే విధంగా పంట కొనుగోలు కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలియజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.6850లుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పసుపును విక్రయించదలుచుకొన్న రైతులు సీఎం యాప్‌లో ఈ క్రాప్ ద్వారా వారి పేరును రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. పంట నాణ్యతను పరిశీలించి పసుపును కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బియ్యం నరసింహారెడ్డి, డీసీఎంఎస్ మేనేజర్ ఖాదర్‌వలి, జిల్లా మార్కెటింగ్ అధికారి టి.త్యాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.విశ్వనాథరెడ్డి, ఆర్.శ్రీనివాసరాజు, బి.రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య, వి.గంగిరెడ్డి, ఎ.సౌమిత్రి, బి.శివయ్య, ఎ.వరదరాజు, ఎం.శ్రీనివాసులగౌడ్, కె.బోయినపల్లి సర్పంచ్ రాజా, ఎంపీటీసీ ఎ.మధుబాబు, రైతులు పాల్గొన్నారు.


పసుపు కొనుగోళ్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, సుకుమార్‌రెడ్డి

అభివృద్ధి పనులు ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు ఈనెల చివరినాటికి పూర్తిచేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు తెలిపారు.

శుక్రవారం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించి మాట్లాడారు. కడప రోడ్డులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల ఓపీడీ బ్లాక్‌తో పాటు నర్సింగ్ కళాశాల, నగరవనం, గరండాలు, స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, శిల్పారామం పనులను పరిశీలించామన్నారు. అభివృద్ధి పనులను వేగవంతంగా ఈనెల చివరినాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు. జూలై 8న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన చేతుల మీదుగా ప్రారంభించే వాటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పనులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పనులను పూర్తిస్థాయిలో నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం అంబకపల్లె రోడ్డు సమీపంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న కార్యాలయ భవన నిర్మాణాలను వారు పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహారెడ్డి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

రేపు కాల భైరవాష్టమి

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని ఎం ఎస్ కొట్టాల గ్రామంలో ఆదివారం శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో ఉదయం 8 గంటలనుంచి కాలాష్టమి పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీరావు తెలిపారు. ఇందులోభాగంగా ఉదయం నుంచి ప్రాతఃకాల సేవలు, పూజలు, ప్రత్యేకించి కుష్మాండ దీప హారతులు నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వం సంస్కరణల పేరిట సర్దుబాటు ట్రూ అప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట విద్యుత్ బిల్లులు తగులబెట్టి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 200 యూనిట్లలోపు వారందరికీ ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. రాత్రివేళల్లో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న సామాన్య ప్రజలు విద్యుత్ భారాలు మోయలేని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, బషీరున్నీసా, సావంత్ సుధాకర్, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త విలియం కేరీ

కడప రూరల్: మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేసి సమాజంను మేల్కొలిపిన గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ విలియం కేరీ అని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ డాక్టర్ బిషప్ కే సామ్యూల్‌బాబు కొనియాడారు. విలియం కేరీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సామ్యూల్‌బాబు మాట్లాడుతూ ఇంగ్లండ్ దేశానికి చెందిన విలియం కేరీ ఇండియాకు వచ్చి ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. సతీసహగమనం తదితర మూఢ నమ్మకాలను పారద్రోలడానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బిషప్ కే దానం, రత్నకుమార్, రాజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ

కడప రూరల్ : గర్భవతులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడప నగరంలోని అక్కాయపల్లె డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భవతుల రికార్డులు, ఇతర వివరాలపై ఆరా తీశారు. అనంతరం దోమల నివారణకు చేపట్టే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటి పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

పెద్దదర్గాలో నాగూరు దర్గా ప్రతినిధుల ప్రార్థనలు


పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న నాగూరు దర్గా ప్రతినిధి మస్తాన్ సాహెబ్

కడప కల్చరల్ : ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్‌పీర్(పెద్ద)దర్గాలో శుక్రవారం నాగూరు దర్గా ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాగూరు దర్గా సజ్జా దె నషీన్ మస్తాన్ సాహెబ్‌ను దర్గా ముజావర్ అమీర్ సాదరంగా ఆహ్వానించారు. సాంప్రదాయ ప్రకారం పేటా చుట్టి కండువా అలంకరించారు. నాగూరు గురువు.. దర్గాలోని ప్రధాన గురువుల మజార్ వద్ద చాదర్ సమర్పించి పూలమాలలు అలంకరించారు. తొలుత ప్రధాన గురువుల మజార్ వద్ద ప్రార్థనలు, ఫాతెహా చేయించి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్ల వద్ద కూడా ప్రార్థనలు నిర్వహింపజేశారు. ఫాతెహా నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన దర్గా ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని పరిశీలించారు.

బ్రౌన్ గ్రంథాలయానికి 1400 పుస్తకాలు


పుస్తకాలను అందజేస్తున్న వెలిదండ నిత్యానందరావు, గీతారాణి

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి మరో 1400 పుస్తకాలు చేరాయి. శుక్రవారం హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు వెలుదండ నిత్యానందరావు, గీతారాణి 1100 పుస్తకాలు, ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి 300 పుస్తకాలను బ్రౌన్ గ్రంథ పాలకులు హరిభూషణరావు, సిబ్బంది నీలకంఠేశ్వర్‌లకు అందజేశారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తమకు చేరిన పుస్తకాలలో చాలా అరుదైన గ్రంథాలు ఉన్నాయని తెలిపారు. తెలుగు గజళ్లు-అధ్యయనం, చందమామ కథలు, పరిశీలన, ప్రకాశం జిల్లా మహిళా సాహితీమూర్తులు, తెలుగు సినీ గేయ సాహిత్యం, తెలుగులో బౌద్ధం, బౌద్ధ సాహిత్యం తదితర అరుదైన పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. ప్రముఖ చిత్రకారులు, రచయిత శీలా వీర్రాజు స్వయంగా చిత్రించిన వేమన చిత్రపటాన్ని ఆయన సతీమణి శీలా సుభద్రాదేవి పుస్తకాలతోసహా తమకు అందజేసిందన్నారు.

కమలాపురానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలి

కడప ఎడ్యుకేషన్: కమలాపురం మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ కమలాపురానికి రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ జరగడం లేదన్నారు. సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభంకానున్నాయని ఈ నేపథ్యంలో రెగ్యులర్ ఎంఈఓను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజు

కడప కోటిరెడ్డి సర్కిల్ : చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్ దేశాలకు ప్రజలను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం ఉందన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు అన్నిరకాల అనుమతులు పొందాలని, లేనిపక్షంలో చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పంచనదీ తీరంలో యోగా ఉత్సవం

కడప కల్చరల్ : జిల్లాలో పంచనదీ సంగమ క్షేత్రంగా పేరున్న పుష్పగిరిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కడి నదీ తీరంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కడప నగరానికి చెందిన మిత్ర యోగా సొసైటీ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్ట్ కల్పన తెలిపారు.

శుక్రవారం సంస్థ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ యోగా దినోత్సవానికి మూడు రోజుల ముందు నదీ తీరంలో దాదాపు వెయ్యి మందికి పైగా సాధకులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహింపజేస్తామన్నారు. పుష్పగిరి భాస్కర (సూర్య) క్షేత్రంగా పురాణాలు పేర్కొన్నాయని, అలాంటి ప్రాంతంలో ఉదయం 6 నుంచి 7.30 గంటల్లోగా వినూత్న రీతిలో యోగా, సూర్య నమస్కారాలు చేయించడం మంచిదని పెద్దలు సూచించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 13వ తేదీ నుంచి వారం రోజులపాటు యోగా వారోత్సవాలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

14న ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

రాజంపేట టౌన్ : అన్నమయ్య జిల్లాలోని మూడు ప్రభుత్వ, పన్నెండు ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు ఈనెల 14వ తేదీ రాజంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, పారిశ్రామిక శిక్షణా సంస్థ కన్వీనర్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలింగ్ ఉదయం 10 గంటలకు మెరిట్ నెంబర్ 1 నుంచి ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు 59వ మెరిట్ నెంబర్ వరకు కౌన్సిలింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 2 గంటల నుంచి మెరిట్ నెంబర్ 60 నుంచి 118 వరకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. అభ్యర్థులకు తమ మెరిట్ నెంబర్‌ను ఇప్పటికే వారి మొబైల్‌కు పంపించామన్నారు.

కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు టెన్త్ మార్క్స్ లిస్ట్, టీసీ, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, దివ్యాంగులైనట్లయితే అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రం, అగ్రవర్ణ పేదలైతే ఈడబ్ల్యూఎస్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రెండు ఫోటోలు, వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ను తమవెంట విధిగా తీసుకురావాలని శ్రీనివాసరావు తెలియజేశారు.